క్లుప్తంగా

మందుబాబులకు అడ్డాగా..



రెడ్డికంచేరు చెత్త సంపద కేంద్రంలో పేరుకుపోయిన మద్యం సీసాలు

భోగాపురం: చెత్త నుంచి సంపద సృష్టించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం కొన్ని కోట్ల రూపాయలను వెచ్చించి చెత్త సంపద కేంద్రాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం వీటి నిర్వహణను గాలికి వదిలేయడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మండలంలోని రెడ్డికంచేరు పంచాయతీ పరిధిలో నిర్మించిన చెత్త సంపద కేంద్రం నిర్వహణను పంచాయతీ అధికారులు పట్టించుకోకపోవడంతో.. రాత్రి వేళల్లో మందుబాబులు మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాలను సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

నెల్లిమర: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షాను బర్తరఫ్ చేయాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు, కాంగ్రెస్ నాయకుడు కనకల పద్మనాభం డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఇందిరా కాలనీ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళితులు, వెనుకబడిన వర్గాల ఆధ్వర్యంలో అమిత్ షా వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రధానమంత్రి మోదీ అమిత్‌షాను వెనకేసుకు రావడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో తుర్ల అప్పలనరసయ్య, ఎం.దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చేపట్టాలి



ఒమ్మిలో రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ సిబ్బంది

రాజాం: వర్షాలకు అపరాల పంటలు నష్టపోకుండా ఉండేందుకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో రేణుకాసాయి రైతులకు సూచించారు. మండలంలోని ఒమ్మి, నందబలగ, లక్ష్మీపురం, పాగిరి తదితర గ్రామాల్లో సాగు చేస్తున్న అపరాల పంటలను ఆమె ఆదివారం పరిశీలించారు. పూత దశలోని పెసర, మినప పంటలకు మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పు ద్రావణాన్ని స్ప్రే చేయాలన్నారు. పువ్వు దశలోని పంటలకు 15 కిలోల యూరియా, శాఫ్ అర కిలో పొడర్ వేస్తే పంటలు పాడవ్వకుండా ఉంటాయన్నారు. ఐరన్ లోపించిన పొలాలకు ఫార్ములా-4 ద్రావణాన్ని అర లీటరు ఎకరా పొలానికి పిచికారీ చేయాలన్నారు.

అధునాతన వైద్యం అందించాలి



ఆస్పత్రిలో పలు విభాగాల గదులను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: ఆస్పత్రికి వచ్చే రోగులకు అధునాతన వైద్యసేవలు అందించాలని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినఅప్పలనాయుడు కోరారు. స్థానిక పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద నిర్మించిన అభయ ఆస్పత్రిలోని పలు విభాగాలను ఆయన ఆదివారం ప్రారంభించి, మాట్లాడారు. డాక్టర్ అనిల్‌కుమార్.. ఈ ప్రాంత ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులో తీసుకువచ్చేందుకు ఈ వైద్యాలయాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బేబీనాయన, డాక్టర్ అర్నిపల్లి గోపీనాథ్, మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఎస్.వేణుగోపాలనాయుడు, బి.సత్యనారాయణ, ఆర్.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్రగాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్‌పై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నడిమివలస రాంబాబు అనే యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఏఎస్‌ఐ జి.భాస్కరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గుర్ల మండలం, గొలగాం గ్రామానికి చెందిన రాంబాబు.. బొబ్బిలిలో ఇందిరమ్మ కాలనీలో జరుగుతున్న ఓ శుభకార్యానికి హాజరై, ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్ వద్దకు తన బంధువులను తీసుకువెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి ఇందిరమ్మ కాలనీకి వస్తుండగా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన ఓ లారీ అతడిని వెనక నుంచి ఢీకొట్టింది. దీంతో అతడి ఎడమ తొడ, పాదం నుజ్జునుజ్జయ్యాయి. చికిత్స నిమిత్తం బొబ్బిలి సీహెచ్‌సీకి క్షతగాత్రుడిని తరలించగా, మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు.



రెల్లివలసలో కొబ్బరిలో అంతర పంటగా వేసిన అల్లం



గూడపువలసలో కొబ్బరిసాగులో అంతర పంటగా వేసిన అరటిసాగు

అంతర పంటలతో అధిక ఆదాయం..

- అన్నదాతలకు ఆర్థిక భరోసా

పూసపాటిరేగ: ఉద్యానవన తోటల్లో అంతర పంటలు సాగు చేస్తూ రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. జిల్లాలో తీరప్రాంత మండలాలైన పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో అత్యధికంగా కొబ్బరి సాగవుతోంది. వాటిలో అంతరపంటగా అరటి, జామి, కోకో మొదలగు పంటలు వేసి రైతులు ఆర్థికంగా ఎదుగుతున్నారు. ఎకరాకు సుమారు రూ. 50 వేల నుంచి 70 వేల రూపాయల వరకు కళ్లజూస్తున్నారు. రెండు మండలాల్లో సుమారు 10 వేల ఎకరాలలో కొబ్బరిసాగు జరుగుతోంది. వాటిలో సుమారు 6,500 ఎకరాలలో వివిధ రకాల అంతర పంటలు సాగు చేస్తున్నారు. తీరప్రాంత గ్రామాలైన చింతపల్లి, కొణతాలపాలెం, కృష్ణాపురం, చొడువాడ, రోలుచప్పిడి, చినపతివాడ, పెదపతివాడ, రాయుడుపేట, రెల్లివలస, కోనయ్యపాలెం, ముక్కాం, చేపలకంచేరు, దిబ్బలపాలెం, గూడపువలస, ముంజేరు, తదితర గ్రామాలలో కొబ్బరి సాగు చేస్తున్నారు.

తెగుళ్లకు చెక్..

ఉద్యానవన సాగులో అంతరపంటలు వేయడం వల్ల భూములకు ఎంతో మేలు జరుగుతుందని ఉద్యానవన శాఖాధికారి జ్యోత్స్న తెలిపారు. అంతరపంటల వల్ల తెగుళ్ల వ్యాప్తి తక్కువగా ఉంటుందన్నారు. అంతర పంటల కోసం భూములు బాగా దున్నడం వల్ల తెగుళ్లు నివారించబడతాయని చెప్పారు. అలాగే భూసారం కూడా పెరుగుతుందని తెలిపారు.

లాభాలు ఆర్జిస్తున్నాం..

కొబ్బరిసాగులో అరటి వేయడంతో లాభాలు ఆర్జిస్తున్నాం. ఒకే భూమిలో రెండు రకాల సాగులు ఏకకాలంలో జరగడం వల్ల నాలుగు డబ్బులు కళ్లజూస్తున్నాం. అంతర పంటల వల్ల భూమి కూడా సారవంతమవుతోంది.

– పి.రామునాయుడు, రైతు, పతివాడ

అంతర పంటలతో అదనపు ఆదాయం



అంతర పంటలతో అదనపు ఆదాయం సమకూరుతుంది. ఎరువులు, నీటి వృథా జరగదు. తోటలలో సూక్ష్మ వాతావరణం ఉంటుంది. కొబ్బరి సాగులో కోకో, జామి అంతర పంటలుగా వేయడంతో లాభాలు వస్తున్నాయి.

– జ్యోత్స్న, భోగాపురం ఉద్యానవనశాఖ అధికారి

పోరాటయోధుడు పీవీ రావు



కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

- మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ

విజయనగరం ఫోర్ట్: మాలమహానాడు స్థాపించి ఉద్యమమే ఊపిరిగా పోరాటం చేసిన పోరాట యోధుడు పీవీ రావు అని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు లోగిశ రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక మాల మహానాడు కార్యాలయంలో పీవీ రావు వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ రద్దు కోసం చివరి శ్వాసవరకు పీవీ రావు పోరాడారని చెప్పారు. కార్యక్రమంలో మలమహానాడు నాయకులు నూకరాజు, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి..

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు గ్రామ శివారులో స్థానిక బ్రిడ్జి వద్ద నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆదివారం దాడులు చేపట్టి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2,510 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో ప్రవేశపెట్టినట్లు ఎస్సై గణేష్ తెలిపారు.

నిత్యాన్నదానం

రేగిడి: మండలంలోని వావిలవలస గ్రామంలో చిరువ్యాపారి వారణాసి జగన్నాథస్వామి ఆధ్వర్యంలో నిత్యాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దాతలతో పాటు తన కుటుంబ సభ్యుల ఆర్థికసాయంతో ఈ కార్యక్రమం గత 19 ఏళ్లుగా చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా ఆదివారం పలువురు పేదలకు అన్నం దానం చేశారు.

రక్తదానం.. ప్రాణదానం



రక్తం దానం చేస్తున్న యువత

బొబ్బిలి: పట్టణంలో అవేర్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు మనోజ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించారు. పలువురు శిబిరానికి హాజరై, రక్తం దానం చేశారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని, ప్రతిఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. రక్తం దానం చేస్తే అనారోగ్యం బారినపడతామన్న అపోహ వద్దన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతిఒక్కరూ ప్రతీ మూడు నెలలకోసారి రక్తం దానం చేయవచ్చన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: రోజురోజుకూ సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సీఐ కె.నారాయణరావు సూచించారు. మండలంలోని తారాపురం గ్రామంలో గ్రామస్తులతో ఆదివారం సమావేశమైన ఆయన.. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. స్మార్ట్‌ఫోన్లకు వచ్చే అనవసర కాల్స్, మెసేజీలకు స్పందించవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

రాజాం సిటీ: మాదక ద్రవ్యాల వినియోగంతో అనర్థాలు తప్పవని రాజాం రూరల్ సీఐ హెచ్.ఉపేంద్ర హెచ్చరించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా గంజాయి వంటి మత్తు పదార్థాలు నిర్మూలించడమే లక్ష్యమని, దీనికి ప్రజల నుంచి సహకారం అవసరమన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉందాం.. విలువైన ప్రాణాలను కాపాడుకుందాం అనే నినాదంతో పొనుగుటివలస జంక్షన్, కేర్ ఆస్పత్రి రోడ్డు జంక్షన్, పలు ప్రధాన కూడళ్లలో అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఇవేం రోడ్లు బాబోయ్..



గుంతలమయంగా మారిన తోటపల్లి - బోయపాలెం రోడ్డు



అధ్వానంగా బమ్మిడిపేట రోడ్డు

- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న వాహన చోదకులు
- మరమ్మతులు చేయాలంటూ డిమాండ్

భోగాపురం: గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. మండలంలోని ముక్కాం నుంచి తోటపల్లి, బోయపాలెం మీదుగా చేపలకంచేరు గ్రామానికి వెళ్లే రోడ్డు.. రెడ్డింకంచేరు నుంచి బమ్మిడిపేట, కొంగవానిపాలెం మీదుగా ముంజేరు వెళ్లే రోడ్డు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఆయా రోడ్లపై రాకపోకలకు ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ముక్కాం నుంచి చేపలకంచేరు గ్రామానికి వెళ్లేందుకు సుమారు 4 కిలోమీటర్లు.. రెడ్డికంచేరు నుంచి ముంజేరు గ్రామానికి వెళ్లేందుకు సుమారు 3 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి ఉంటుంది. అయితే ఈ రోడ్లు పూర్తిగా గోతులతో నిండిపోవడంతో ప్రమాదాల బారిన పడుతున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బోయపాలెం, కొంగవానిపాలెం గ్రామాల్లో ఆక్వా హేచరీస్‌లు, మిరాకిల్ ఇంజినీరింగ్ కళాశాల ఉండడంతో వాహనాలు ఎక్కువ సంఖ్యలో రాకపోకలు సాగిస్తుండడం వల్ల రోడ్లు పాడయ్యాయి. ఈ రోడ్లలో పలుమార్లు ద్విచక్ర వాహనదారులు, ఆటోలు ప్రమాదాల బారిన పడ్డాయి. ముంజేరు గ్రామానికి చెందిన స్థానిక ఎమ్మెల్యే లోకం నాగమాధవి ఈ రోడ్ల మీదుగానే రాకపోకలు సాగిస్తున్నా.. రహదారుల మరమ్మతుల కోసం పట్టించుకోకపోవడం సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



తోటపల్లి రోడ్డులో నిలిచిన నీరు మీదుగా వస్తున్న ఆటో

రోడ్డు వేయాలి



మా గ్రామం నంచి బమ్మిడిపేట, కొంగవానిపాలెం గ్రామాల మీదుగా ముంజేరు గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ద్విచక్ర వాహనచోదకులు ప్రమాదాలకు గురైన సందర్భాలు కూడా ఉన్నాయి. స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి.

– శీరపు వంశీరెడ్డి, రెడ్డికంచేరు గ్రామం

ప్రభుత్వ స్థలం కబ్జా..



విజయనగరం మండలంలోని చెల్లూరు గ్రామ కాలనీలో సర్వే నంబర్ 122లో గల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నాయకుడి అండతో స్థానికులు కబ్జాచేశారు. ఆ స్థలంలో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి పునాదులు తీయడానికి సిద్ధపడుతుండగా... విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు పనులను నిలిపివేశారు. ప్రభుత్వ భూములను ఎవ్వరు కబ్జా చేసినా చర్యలు తప్పవన్నారు.

– విజయనగరం రూరల్

ఇంటి వరండాలోనే ధాన్యం ఆరబోత



తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు పంట పొలాలు, కళ్లాల్లో నీరు చేరింది. దీంతో తడిచిపోయిన ధాన్యాన్ని వెంటనే ఆరబెట్టకపోతే మొలకలు వచ్చే అవకాశం ఉండడంతో రైతులు ఇంటి ఆవరణల్లోనే ధాన్యం ఆరబెడుతున్నారు. మలిచర్లకు చెందిన తుమ్మిగింటి రామారావు తన ఇంటి వరండాలోనే ధాన్యం ఆరబెట్టడం సాక్షి కంటపడింది.

– విజయనగరం రూరల్

నిండుకుండ..



విజయనగరం మండలంలోని గుంకలాం పెద్ద చెరువు నిండుకుండను తలపిస్తోంది. ఇటీవల వరుసుగా కురిసిన వర్షాలకు చెరువు నీటితో నిండిపోయి కళకళలాడుతోంది. రబీ సీజన్‌కు నీటి ఇబ్బంది ఉండదని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

– విజయనగరం రూరల్

భగవద్గీత పుస్తకాల పంపిణీ



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న మోక్ష విద్య యోగ మందిర్ సభ్యులు

శృంగవరపుకోట: స్థానిక మోక్ష విద్య యోగ మందిర్ నిర్వాహకులు షీలా కోటేశ్వరరావు ఆదివారం పట్టణంలోని పలు కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవద్గీత పఠనం ప్రతీ భారతీయుని కర్తవ్యం కావాలన్నా లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు.పెద్దలతో పాటు ప్రతి ఇంట్లో పిల్లలు భగవద్గీతను చదవాలని కోరారు. యోగ మందిర్ సభ్యులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం ఇవ్వాలి



పురిటిపెంటలో వరదనీటిలో ఉన్న వరికుప్పలను పరిశీలిస్తున్న రాములు

గజపతినగరం: అల్పపీడనం ప్రభావంతో నాలుగు రోజుల పాటు కురిసిన వర్షాలకు జిల్లాలో వరి,అపరాల పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం తక్షణమే రైతులకు పరిహారం ఇవ్వాలని ఏపీ కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. పురిటిపెంటలోని సుబ్బసాగరం,లెంక చెరువు,ఊరచెరువు ఆయకట్టు కింద వరదనీటిలో ఉన్న వరికుప్పలు, నీటమునిగిన అపరాల పంటలను ఆదివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దెబ్బతిన్న వరి,అపరాల పంటలకు ఎకరానికి రూ.50వేల చొప్పున రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. రెవెన్యూ అధికారులు సర్వేచేసి పంటనష్టాలను అంచనా వేసి, ప్రభుత్వానికి నివేదికలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏపీ రైతు సంఘం ఏరియా కన్వీనర్ దాసరి సింహాద్రి, రైతులు దాసరి జానకిరాము,గంట్రేటి రాము నాయుడు,దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.